


తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.15	1,628.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	32,924	8,651
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,20,097	10,302
సామర్థ్యం (టీఎంసీలు)	83.74	89.08

కనిపించని స్వాతంత్ర్య సందడి!



గతంలో ఆగస్టు 15న కళకళలాడుతున్న టీబీ డ్యాం



ప్రస్తుతం క్రస్ట్‌గేట్ల మరమ్మతుల కారణంగా భారీ క్రేన్లతో ఇలా..

● బళ్లారిలో కనిపించని స్వాతంత్ర్య దినోత్సవ శోభ ● నిర్మానుష్యంగా తుంగభద్ర డ్యాం ప్రాంతం

బళ్లారి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందడి పెద్దగా కనిపించడంలేదు. మామూలుగా ఆగస్టు 15వతేదీ వస్తోందంటే అధికారులంతా స్వాతంత్ర్య వేడుకల్లో నిమగ్నమయి ఉండేవారు. కాని ఈ సంవత్సరం టీబీ డ్యాంకు ప్రమాదం జరగడంతో దాని పైనే అందరూ దృష్టి సారించారు. మామూలుగా ప్రతిసంవత్సరం ఈ సమయానికి డ్యాం నిండుకుండలా తొణికిసలాడుతూ.. నీటి అలలు ఎగసిపడుతుంటే..గలగలలాడుతూ ఉండేది. అక్కడ పక్షులు, నీటి ప్రాణులు సందడి చేస్తుంటే తుంగభద్రమ్మ.. అందరికి చల్లటి వాతావరణం ఇస్తూ హాయిని గొలిపేది. అలాంటిది ఇప్పుడు మౌనంగా ఉంటూ తన గర్భంలో దాచుకున్న నీరు తన నుండి బయటకు వృధాగా వెళ్లిపోతోందే అనే బాధతో మూగగా రోదిస్తూ మౌనంగా ఉండిపోతోంది. పంద్రాగస్టు నేపథ్యంలో రంగులతో జలపాతంలా పారే డ్యాంలో ఈ సంవత్సరం భారీగా నీరు చేరింది. అనుకోకుండా ప్రమాదం జరిగి నీరంతా నదిపాలవుతోంది. ఈ సమయంలో తాను నిండుకుండలా తొణికిసలాడుతూ అందరినీ కనువిందుచేసే తుంగభ్రద్రమ్మ సందర్శకులకు సంతోషించే సమయం ఇదికాదని బాధపడుతోంది.

తుంగభద్ర డ్యామ్‌కు తరలివస్తున్న జనంలో నిరాశ

రాయచూరు: మూడు రాష్ర్టాల రైతులకు వర ప్రదానంగా ఉన్న తంగభద్ర డ్యామ్‌కు చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి జనం పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో తుంగభద్ర పరిసరాలన్ని జనసాగరంగా మారాయి. నాల్గు రోజుల క్రితం నిండుకుండలా పూర్తి స్థాయి నీటిమట్టంతో జలాశయం కళకళలాడుతుండగా క్రస్ట్‌గేట్ తెగిపోవడంతో ఒక్కసారిగా డ్యామ్ కళావిహీనంగా మారింది. దీంతో సందర్శకులు డ్యామ్‌ను పరిశీలిస్తూనే ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. రోజు 8 నుంచి 10 టీఎంసీల నీటిని దిగువకు వదులుతుండడంతో క్రమ క్రమంగా డ్యామ్ పూర్తిగా ఖాళీ అవుతుండడాన్ని సందర్శకులు చూడలేకపోతున్నారు. ముఖ్యంగా రైతులు డ్యామ్‌లో నీరు ఖాళీ అవుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు.

ఆహార తయారీలో నాణ్యతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారి నందకాడి

బళ్లారి సిటీ, ఆగస్టు 14: ఆహార పదార్థాల తయారీలో భద్రత, నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నందకాడి అన్నారు. ఫుడ్‌సేఫ్టీ అండ్ క్వాలిటీ డిపార్ట్‌మెంట్, బళ్లారి హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుడ్‌సేఫ్టీపై పారిశ్రామికవేత్తలకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆహార నాణ్యత నిర్వహణ చట్టం ప్రజలకు మేలుచేస్తుందన్నారు. అన్ని రకాల ఆహార పదార్థాల తయారీదారులు, రవాణాదారులు, ఫుడ్ పాసెసర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఆహారభద్రత కు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, వివిధ హోటళ్ల జనరల్ మేనేజర్లు మాట్లాడుతూ... నాణ్యమైన ఆహార పదార్థాల తయారీకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బళ్లారి జిల్లావాణిజ్య పరిశ్రమ సంఘం అధ్యక్షుడు బి. మహారుద్రగౌడ, సీనియర్ ఉపాధ్యక్షుడు యశ్వంత్రాజ్ నాగిరెడ్డి, గౌరవ కార్యదర్శి కేసీ. సురేశ్‌బాబు, జాయింట్ సెక్రటరీ మార్చెడ్ మల్లికార్జునగౌడ, నగరంలోని హోటల్ యజమానుల సంఘాల ఆఫీస్ బేరర్లు, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఐదుగురు బాలకార్మికులకు విముక్తి


మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి రాజేశ్‌హొసమనె

బళ్లారి సిటీ, ఆగస్టు 14: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించి ఐదుగురు బాలకార్మికులను రక్షించినట్లు జిల్లా బాలకార్మికుల పథకం ప్రాజెక్ట్ అధికారి మౌనేశ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, బాలకార్మిక, యువజన కార్మిక(నిషేదం, నియంత్రణ) చట్టం 1996కింద నియమించిన ఇన్‌స్పెక్టర్ల టాస్క్ ఫోర్స్ కమిటీ, జిల్లా బాలకార్మిక పథకం, కార్మిక శాఖ, పోలీసు శాఖ, జిల్లా సహా వివిధ శాఖల సహకారంతో చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, జిల్లా విద్య, అక్షరాస్యత శాఖ, యాదృచ్ఛిక దాడిని నిర్వహిస్తోంది. దీని ప్రకారం మంగళవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శులు, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అధ్యక్షతన తాలూకా టాస్క్‌ఫోర్స్ కమిటీ నగరంలోని గుగ్గరహట్టి, ముండ్రగి పారిశ్రామికవాడలోని ఫ్యాక్టరీలు, గ్యారేజీలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఐదుగురు బాలకార్మికులను పని నుండి విముక్తి చేసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. వారు చదివిన పాఠశాలల్లోని వయస్సు రికార్డులనుబట్టి యాజమాన్యాలపై బాల కార్మిక నిషేధ చట్టం, 1989సవరణ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలో తహసీల్దార్ గురురాజ్, లేబర్ అధికారి సిద్దప్ప, ఖైనూర్, లేబర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం, రమేశ్, సీనియర్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ వరుణ్, విద్యాశాఖాధికారి మంజునాథ్, చైల్డ్‌లైన్ సిబ్బంది చంద్రకళ, నిలోఫియా తదితరులు పాల్గొన్నారు.

దరోజీ చెరువులో అన్నీ ముళ్లకంపలే



కంప్లి, ఆగస్టు 14 : జిల్లాలోనే అతి పెద్దదైన దరోజీ చెరువు అపరిశుభ్రంతోను, ముళ్లకంపలతో నిండిపోయిఉంది. ఇప్పటికే చెరువు అభివృద్ధి కోసం నిధులు మంజూరైనా ఇంతవరకు చెరువు గట్టుపైన ముళ్లకంచెలు తొలగించలేదని సంఘసంస్థ నేతలు వాపోతున్నారు. అతిథిగృహంనుంచి తోరణగల్లు వైపు, వీరభద్రేశ్వరాలయం వైపు ఇరువైపులా గట్లపైన ముళ్లకంపలు పెరిగి పోయాయి. ఇప్పటికైనా అధికారులు ముళ్లకంపలను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడటంతో పాటు పరిశుభ్రంగా వుంచాలని కోరారు.

జాతీయ జెండాలే వారికి భుక్తి...

● బళ్లారిలో జెండాలను అమ్ముతున్నఅనంతపురం వాసులు


మోతీ సర్కిల్‌లో జెండాలు విక్రయిస్తున్న దృశ్యం


కలెక్టర్ ఆఫీసు సమీపంలో జెండాలు అమ్ముతున్న అనంతవాసులు

బళ్లారిరూరల్, గాంధీనగర్, ఆగస్టు 14: బళ్లారి నగరంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నగరంలో భారీగా జెండాలను విక్రయి స్తున్నారు. ఇందుకోసం అనంతపురం నుంచి పలువురు బళ్లారికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బళ్లారిలో 18 సంవత్సరాలుగా జెండాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. రూ.వంద నుండి రూ. వెయ్యి వరకు మన భారతీయ జాతీయ జెండాలను విక్రయిస్తున్నామని, ఈ సంవత్సరం జెండాలు ఎక్కువగా అమ్ముడుపోయాయని తెలిపారు. నగర యువతలో దేశభక్తి పెంపొందించేందుకు నగరంలోని సంగం సర్కిల్, రాయల్ సర్కిల్, మోతి సర్కిల్, సుధాసర్కిల్‌లో జాతీయ జెండాలు చేతబట్టి నగర ప్రజలను ఆకర్షిస్తున్నారు. అదే రీతిలో నగర ప్రజలు జాతీయ జెండాలు కొనుగోలు చేసి ఇళ్లపై ఏర్పాటు చేసుకుని, దేశభక్తిని చాటుకుంటున్నారు.

పంట రక్షణకు ఎన్ని కష్టాలో..


దేవసముద్రంలో సజ్జపంట వద్ద తప్పెట్లతో శబ్దాలు చేస్తున్న బాలుడు

కంప్లి, ఆగస్టు 14: రైతులు పండించిన పంటలను చేజిక్కించుకునేందుకు కష్టాలుపడక తప్పడం లేదు. వేసిన పంటలు చేతికొచ్చే సమయంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొని పంటలను కాపాడుకోవల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పంటలు ఏపుగా ఎదిగిన సమయంలో తెగుళ్ల బాధలు. అంతే కాకుండా పండిన పంటలను కోతుల నుంచి, పక్షుల నుంచి రక్షించుకోవడానికి తప్పెట్లతోను, మైకులతోను శబ్దాలు చేయాల్సిందే. ఈ ఏడు సజ్జ పంట ఏపుగా పెరిగింది. అయితే పక్షుల వల్ల రైతులు నష్టపోతున్నారు. వాటి నుండి పంటను కాపాడేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పెట్లతో ఇలా శబ్దాలు చేస్తూ పంటను కాపాడుకుంటున్నారు. చివరకు వచ్చిన పంటను కళ్లంలో వేసుకుని వాటిని ధాన్యంగా మార్చుకుని ఇంటికి తీసుకెళ్లే సరికి రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. అలాగే బసాపురం వద్ద మొక్కజొన్న పంట నిన్న కురిసిన వర్షానికి పూర్తిగా తడిసిపోయింది.

కుటుంబ నియంత్రణకు వాసెక్టమీపై అవగాహన

బళ్లారి సిటీ, ఆగస్టు 14: చిన్నకుటుంబం కావాలని నిర్ణయించుకునే దంపతులకు చాలా సులభమైన నోస్కాపెల్ వాసెక్టమీ(ఎన్ఎస్‌వీ) శస్త్ర చికిత్సపై అవగాహన కల్పించాలని రాష్ట్ర డైరెక్టరేట్ కుటుంబ సంక్షేమ, కుష్టువ్యాధి నిర్మూలన డిప్యూటీ డైరెక్టర్ చంద్రికా అన్నారు. బుధవారం జిల్లాపర్యటనకు వచ్చిన ఆయన జిల్లాఆరోగ్య , కుటుంబ సంక్షేమశాఖ అధికారుల హాల్లో జిల్లాలోని వైద్యాధికారులందరినీ ఉద్దేశించి మాట్లాడారు. పురుషులకు సాధారణ గర్భనిరోధక పద్ధతి అయిన ఎన్ఎస్‌వీ శస్త్రచికిత్స గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. చిన్న కుటుంబాన్ని కలిగి ఉండాలని నిర్ణయించుకునే ప్రతిజంటస్త్రీలే కాకుండా భర్తలు కూడా సులభమైన నోస్కాపెల్‌వాసెక్టమీ (ఎన్ఎస్‌వీ) శస్త్రచికిత్సతో ముందుకు రావాలన్నారు. సమాజంలో దంపతులు పిల్లలను కనకూడదని నిర్ణయించుకున్నప్పుడు గర్భానికి మాత్రమే లాపరోస్కోపిక్ లేదా ట్యూబెక్టమీ శస్త్ర చికిత్స చేయాలన్నారు. డీహెచ్ఓ రమేశ్‌బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నో స్కాపెల్ వెసెక్టమీ శస్త్ర చికిత్సపై వైద్యాధికారులకు మరింత అవగాహన కల్పించాలని అన్నారు. పురుషులకు గర్భనిరోధక సాధనాలు, మహిళలకు పిపిఐయుసిడీ తదితర వంటి తాత్కాలిక పద్ధతులు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా జిల్లాకుటుంబ సంక్షేమ కార్యక్రమ అమలు అధికారి డాక్టర్ హూర్తిమకట్టిమణి, జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, జిల్లా సర్వే అధికారి మరియంబి, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ చంద్రిక తదితరులు

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 14: ఆగస్టు 15వ తేదీ వచ్చిందంటే చాలు వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెరుగుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో నగరంలో ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా పాలనా మండలి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసింది. కార్యక్రమంలో భాగంగా నగరంలోని ప్రధాన కూడళ్లను ఇప్పటికే రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. విమ్స్ క్రీడా మైదానంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి బచ్చేగౌడ ధ్వజారోహణ గావించి గౌరవ వందనం స్వీకరిస్తారు. అంతకు మునుపు మోతి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన 150 అడుగుల ఎత్తులో గల ఇదే కార్యక్రమంలోని నగరంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు విమ్స్ మైదానంలో దేశభక్తిని చాటే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.


మోతీ సర్కిల్‌లో ముస్తాబవుతున్న 150 అడుగుల జెండా స్తంభం

రక్తదాన శిబిరం


రక్తదానంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు

బళ్లారి సిటీ, ఆగస్టు 14: నగరంలోని హవంబావిలో వెలసిన శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో బుధవారం రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ భరతమాత ధీమంతపుత్రుడు, ఆధునిక శిక్షణరంగ దిగ్గజం, శ్రీచైతన్య శిక్షణ సంస్థల సంస్థాపకుడైన బిఎస్.రావ్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్, ఏసీఎం రాధ, హరికృష్ణ, సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

చేపల వలలకు పెరిగిన డిమాండ్


కంప్లి కోట వద్ద వలలను కొనుగోలు చేస్తున్న మత్స్యకారులు

కంప్లి, ఆగస్టు 14: వర్షాలు పుష్కలంగా పడటంతో మత్స్యకారులు ప్రతినిత్యం చేపలను పట్టి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ ప్రయత్నంలో వారికి చేపల వల ఎంతైనా అవసరం. నదికి భారీఎత్తున నీరు రావడంతో గంగావతి, కొప్పాళ, మాన్వి, సింధనూరు, బళ్లారి, సిరుగుప్ప, అనంతపురం, కర్నూలు తదితర గ్రామాల నుంచి కూడా మత్స్యకారులు చేప వలలను కొనుగోలు చేయడానికి కంప్లి కోటకు క్యూ కట్టారు. వలలు రూ.వెయ్యి నుంచి 1500లు వరకు ధర పలుకుతుండగా, ప్రస్తుతం వాటిధర రూ.రెండు వేలు నుంచి రూ.మూడు వేలకు పెరుగింది. అయినప్పటికీ లెక్కచేయకుండా కొనుగోలు చేస్తున్నారు.

వర్షంతో దెబ్బతిన్న రహదారులు


వేదావతి బ్రిడ్జిపై గుంతలమయంగా రోడ్డు

బళ్లారిరూరల్, ఆగస్టు 14: బళ్లారి తాలుకాలో రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. రూపనగుడి, రాయపురం, హగరి, చేళగుర్కి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం కారణంగా వేదావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పంటపొలాలు నీటిలో మునిగాయని రైతులు తెలియజేస్తున్నారు. వేదావతి వంతెనపై పెద్ద పెద్ద గుంతలు పడటంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరగా డ్యామ్ గేటు ఏర్పాటు చేయాలి

సిరుగుప్ప, ఆగస్టు 14 : టీబీ డ్యామ్ గేటు పనులను త్వరగా పూర్తి చేయకపోతే కర్నూలు, అనంతపురం, బళ్లారి, రాయచూరు, కొప్పాళ, విజయనగర జిల్లాల రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిరుగుప్ప పట్టణ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో టీబీ డ్యామ్ నీటి మట్టం రెండు టీఎంసీలు ఉన్నప్పుడు అధికారులు ఎక్కడికెళ్లారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గేటు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. హెచ్చెల్సీ, ఎల్ఎల్‌సీ కాలువల నుంచి హగరి నదికి నీరు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మైకేల్ వీరేష్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

128 నాటు తుపాకుల స్వాధీనం


అటవీ ప్రాంత ప్రజల నుంచి స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులను చూపుతున్న కలెక్టర్

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 14: కృష్ణగిరి జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో అటవీప్రాంతం చుట్టు ప్రక్కల నకిలీ తుపాకులు కలిగి ఉన్న వారి నుంచి 128 నకిలీ తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. అధికారి కార్తీకేయని సమక్షంల్లో బుధవారం పోలీసులకు తుపాలకులను అప్పగించారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు ఫారెస్ట్ డివిజన్ జిల్లా మొత్తం వైశాల్యంలో 29 శాతం విస్తరించి ఉంది. ఇక్కడ నివసించే అరుదైన జంతు జాతుల రక్షణను దృష్టిలో ఉంచుకుని, కావేరీ నార్త్ వెల్డ్ లైఫ్ శాంక్చురీ 2022లో స్థాపించారు. కావేరీ సౌత్ వన్యప్రాణుల అభయారణ్యంలో ఏనుగులు మృతి చెందడంతోపాటు వ్యవసాయ భూముల్లో పంటలు తినేందుకు వస్తున్న ఏనుగులు కూడా చనిపోతున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో అటవీశాఖ అధికారులు ముమ్మరంగా నిఘా పెట్టి అటవీ నేరాలు, వన్యప్రాణుల నేరాలను గుర్తించి 3 ఏళ్లలో 14 అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకుని వన్యప్రాణి నేరాల ఆయుధ నిషేధ చట్టం క్రింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకున్నారు. కావున అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు అడవులపై ఆధారపడిన గ్రామాల్లో నివసించే యువకుల వద్ద అక్రమంగా మరణాయుధాలు ఉంటే అటవీశాఖ అధికారులకు అందజేయాలని సూచించారు. వారి కృషి ఫలితంగా అటవీ ప్రాంతం చుట్టూ నకిలీ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు వాటిని స్వయంగా అధికారులకు అప్పగించారు

వీధికుక్కల బెడద నివారణకు చర్యలు

హోసూరు, ఆగస్టు 14 : హోసూరులో వీధికుక్కల బెడద పెరుగుతూ అనేక చోట్ల ప్రజలకు ఇబ్బంది కలిగిస్తోంది. దీంతో పాఠశాల విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పార్లమెంటుల్లో కూడా దీనిపై చర్చ జరిగింది. ఈ దశల్లో హోసూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ సత్య, మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు డిప్యూటీ మేయర్ ఆనందయ్య, పబ్లిక్ హెల్త్ కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్ ఆధ్వర్యంలో నగర పరిధిలో వీధికుక్కల పెంపకాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. వీధికుక్కలకు టీకాలు వేయడమే కాకుండా ఆనంద్ నగర్‌లో స్టెరిలైజేషన్ థియేటర్ ఏర్పాటుచేశారు.

వాహనంలో చెలరేగిన మంటలు

హోసూరు, ఆగస్టు 14: హోసూరు బస్టాండ్ సమీపంలోని సర్వీస్ రోడ్డుపై కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి హోసూరు వైపు వస్తున్న స్కార్పియో వాహనంలో మంటలు చెలరేగాయి. దీంతో కారులో ఉన్న వారు కిందకు దిగి ప్రాణాలతో బయటపడ్డారు. కారు నుంచి పొగలు పైకి రావడంతో వెంటనే ఆ ప్రాంత ప్రజలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హోసూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. ఈ విషయంపై హోసూరు అగ్నిమాపక శాఖ దర్యాప్తు చేస్తున్నారు.


దగ్ధమవుతున్న కారు

అక్టోబరు 5న గోకాక్ ఆందోళనపై ప్రత్యేక సమావేశం


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం

● కన్నడ భాషాధికార సంఘం అధ్యక్షుడు పురుషోత్తం

రాయచూరు, ఆగస్టు 14 : రాష్ర్టానికి కర్ణాటకగా నామకరణం జరిపి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా అక్టోబర్ 5న రాయచూరులో గోకాక్ ఆందోళనకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్నడ భాషాధికార సంఘం అధ్యక్షుడు పురుషోత్తమ్ తెలిపారు. నగరంలోని జిల్లాధికారి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కన్నడ భాషాధికార సంఘం జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కర్ణాటక పేరు ఖరారై 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్రంలోని 4 ప్రాంతాల్లో వేర్వేరు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు కన్నడ భాషాధికార సంఘం నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో రాయచూరులో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశ నిర్వహణకు అన్ని శాఖలు ఏర్పాట్లు చేయాలన్నారు.

హైస్కూలు భవనానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గ్రామ ప్రముఖులు

బళ్లారిరూరల్, ఆగస్టు 14: తాలుకాలోని చాగనూరు గ్రామంలో హైస్కూలు, కళాశాల భవనానికి రాఘవరెడ్డి స్థలం దానం చేశారు. ఈ స్థలంలో నూతన హైస్కూలు భవనానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మల్లికార్జునరెడ్డి, రమేష్, లింగన్న, నాగరాజు, హనుమప్ప, గోపాల్, దేవేంద్ర, రాము, కోటిరెడ్డి, శేఖర్ పలు గ్రామ ప్రముఖులు గ్రామ పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఏడీజీపీ ముద్వా చంద్రశేఖర్ | లోకాయుక్త ఎస్పీ శ్రీనాథ్ ఎం జోషి | లోకాయుక్త ఎస్పీ సీకే బాబా

19 మంది పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకాలు

బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం వివిధ పురస్కారాల జాబితాను ప్రకటించింది. రాష్ట్రం నుంచి 19మంది పోలీసు అధికారులకు రాష్ట్రపతి మెడల్స్ దక్కాయి. ఇంటర్నల్ సెక్యూరిటీ డివిజన్ ఏడీజీపీ ముద్వా చంద్రశేఖర్‌కు విశిష్ట సేవా పతకం దక్కింది. మిగిలిన 18మంది పోలీసు అధికారులకు మెరిటోరియస్ పతకాలకు ఎంపికయ్యారు. వారిలో లోకాయుక్త ఎస్పీ శ్రీనాథ్ ఎం జోషి, బెంగళూరు గ్రామీణ జిల్లా ఎస్పీ సీకే బాబా, బళ్లారి ఏఎస్పీ రామగొండ బి బసరగి, బెంగళూరు సీఐడీ సూపరింటెండెంట్ శరత్, బెంగళూరు పశ్చిమ డీసీ గోపాలరెడ్డి, చన్నపట్టణ డీఎస్పీ గిరి, చింతామణి డీఎస్పీ మురళీధర్.పి, ఇంటెలిజెన్స్ విభాగం కలబురగి ఏడీ బసవేశ్వర, కలబురగి ఐఎస్‌డీ డీఎస్పీ కే బసవరాజ్, మంగళూరు సీసీఆర్‌బీ ఏసీపీ రవీశ్‌నాయక్, బెంగళూరు స్టేట్ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ మహేశ్, బెంగళూరు ట్రాఫిక్ విభాగం ఏసీపీ ప్రభాకర్.జి, హాసన్ కేఎస్ఆర్‌పీ అసిస్టెంట్ కమాండెంట్ హరీశ్ హెచ్ఆర్, దావణగెరె ఎఫ్‌పీబీ ఎస్సై మంజునాథ్ ఎస్ కళ్ళదేవర్, బెంగళూరు కేఎస్ఆర్‌పీ మూడో బెటాలియన్ ఆర్‌పీఐ ఎస్ మంజునాథ, బెంగళూరు సీఐడీ ఏఎస్సై గౌరమ్మ, విజయపుర జిల్లా మనగూళి సీహెచ్‌సీ మహబూబ్‌సాహెబ్ ఎస్ ముజావర్, ఉడుపి డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ ఎంపికయ్యారు.

ఢిల్లీలో వేడుకలకు రాష్ట్రం నుంచి ఆరుగురు సర్పంచ్‌లు

ఢిల్లీలో ఎర్రకోటపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతీయ పతాకావిష్కరణతోపాటు స్వాతంత్ర్య వేడుకల సంబరాల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి ఆరుగురు సర్పంచ్‌లు ఎంపికయ్యారు. ఉత్తమ పాలన, పర్యావరణ ఆసక్తి, పారిశుధ్య నిర్వహణ, పన్నుల సేకరణ, నీటి సరఫరా వంటి సామాజిక బాధ్యతలను సమగ్రంగా నిర్వర్తించినందుకు గ్రామపంచాయతీ అధ్యక్షులకు అవకాశం దక్కింది. చిక్కబళ్ళాపుర జిల్లా గౌరిబిదనూరు తాలూకా గెదరె గ్రామపంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా కమతనూరు పంచాయతీ అధ్యక్షురాలు రాజేశ్వరి గుత్తి, కలబురగి జిల్లా తాజ్ సుల్తాన్‌పుర అధ్యక్షురాలు జయశ్రీ, కొడగు జిల్లా వన్నంపేట తాలూకా కనూరు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు దేవిపీటి, చామరాజనగర తాలూకా అట్టగుళిపుర పంచాయతీ అధ్యక్షురాలు శివమ్మతోపాటు దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా పెరువాయి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నఫీజాలు ఎంపికయ్యారు. బెంగళూరు గ్రామీణ జిల్లా పంచాయతీ ఉపకార్యదర్శి టీకే రమేశ్ నేతృత్వంలో ఆరుగురు ఢిల్లీ స్వాతంత్ర్య సంబరాల్లో పాల్గొననున్నారు. వారిని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే అభినందించారు.


కిటకిటలాడుతున్న కేఆర్ మార్కెట్

రావమ్మా మహాలక్ష్మీ..

● వరమహాలక్ష్మి పండుగకు అంతా సిద్ధం



బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరమహాలక్ష్మి పండుగకు రాష్ట్రమంతటా సిద్ధం అయ్యింది. శ్రావణమాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతంగా ఆచరించడం ఆనవాయితీ. వ్రతానికి అవసరమైన వస్తువుల కొనుగోళ్లతో బుధవారం మార్కెట్లు కిటకిటలాడాయి. నగరంలోని జయనగర్, మల్లేశ్వరం, మడివాళ, యలహంక, కేఆర్ పుర మార్కెట్లు కిటకిటలాడాయి. మైసూరు, మంగళూరు, మండ్యతోపాటు ప్రతిచోటా భారీగా ప్రజలు ఉత్సాహం చూపారు. పూల ధరలు ఆకాశన్నంటాయి. కనకాంబరాలు కిలో రూ.2వేల దాకా పలకగా చామంతులు కిలో రూ.200-300 దాకా, మల్లెలు, గులాబీలు వందల్లో అమ్ముడుపోయాయి.

ముద్వన్నెల అలంకరణ..

● స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆకట్టుకుంటున్న నమూనాలు

బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ముద్వన్నెల రంగులతో అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక ఓరియన్ మాల్స్‌లో దేశభక్తిని చాటే నమూనాలు ఏర్పాటు చేశారు. రాజాజీనగర్, వైట్‌ఫీల్డ్‌లోని మాల్స్‌లో భరతమాత రూపం, జాతీయ జెండా నమూనాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వరుస సెలవులు రావడంతో మాల్స్ సందడిగా మారాయి. జాతీయభక్తిని చాటే నమూనాల వద్ద సెల్ఫీలు, ఫొటోలతో యువత ఉత్సాహం చూపారు.



ఓరియన్ మాల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ పతాకం

టీఎస్పీ మూసివేతతో టీబీ డ్యాంకు కష్టాలు



● డ్యాం నిర్మాణ సమయం నుంచి 45 ఏళ్లు సేవలు ● జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రస్ట్, స్పిల్‌వే గేట్ల తయారీ ● ప్రపంచీకరణ ప్రభావంతో మూతబడ్డ ప్రభుత్వరంగ సంస్థ


టీఎస్పీ స్థలంలో ఏర్పాటైన విజయనగర జిల్లా కలెక్టరేట్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 14: తుంగభద్ర డ్యాంకు కష్టకాలం రావడానికి తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ (టీఎస్పీ) మూసివేతే కారణమని ఆ సంస్థలో పనిచేసిన ఉద్యోగులు అంటున్నారు. తుంగభద్ర ఆనకట్ట నిర్మాణం కోసం, అక్కడికి సమీపంలో ప్రభుత్వ అనుబంధ సంస్థగా టీఎస్పీని 1948లో వర్క్‌షాప్‌గా తొలుత ఏర్పాటు చేశారు. దక్షిణ భారత దేశంలోని పేరొందిన ఆనకట్టలతోపాటు విదేశాల్లో ఉన్న ఆనకట్టల క్రస్ట్‌గేట్లకు అవసరమైన పరికరాలను టీఎస్పీలో తయారు చేసేవారు. డ్యాం నిర్వహణ, క్రస్ట్‌గేట్‌ల తయారీలో అత్యంత అనుభవం ఉన్న నిపుణులు ఇక్కడ పనిచేసేవారు. టీఎస్పీ నిర్వహణలో ఉన్నంత వరకూ తుంగభద్ర డ్యాంకు ఎలాంటి సమస్య తలెత్తలేదని నాటి కార్మికులు, ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. దాదాపు 45 ఏళ్ళ సుదీర్ఘకాలం టీబీ డ్యాంకు సేవలు అందించిన టీఎస్పీని కాదని నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు కంపెనీలకు టీబీపీ అప్పగించింది. ఈ క్రమంలో పనులు తగ్గడం, అప్పుల భారం పెరగడంతో ఖాయిలా పడ్డ పరిశ్రమగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 2007లో దీన్ని మూసివేయించింది.



డ్యాం సమీపంలో.. టీఎస్పీ (ఫైల్)

ప్రతిష్ఠాత్మక సంస్థ

హొస్పేట్ వద్ద తుంగభద్ర జలాశయం నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటి నుంచి ఆనకట్ట పూర్తి అయ్యే వరకు అవసరమైన పరికరాలను తయారు చేసేందుకు టీఎస్పీని ఏర్పాటు చేశారు. తొలుత తుంగభద్ర ఆనకట్టకు అవసరమైన క్రస్ట్ గేట్ల తయారీ కోసం టీఎస్పీ పేరుతో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. 1960లో కేంద్ర ప్రభుత్వం 79 శాతం, ఆంధ్రప్రదేశ్ 12 శాతం, కర్ణాటక 9 శాతం ఈక్విటీతో హొస్పేటలో 90 ఎకరాల విస్తీర్ణంలో పూర్తి స్థాయి యూనిట్ నిర్మాణమైంది. ఆ సమయంలో రెండు వేల కంటే ఎక్కువ మంది పనిచేసేవారని రికార్డులు చెబుతున్నాయి. దేశంలో వివిధ ఆనకట్టలకు అవసరమైన క్రస్ట్‌గేట్లు, స్లూయిస్ గేట్లను టీఎస్పీలో తయారు చేసి సరఫరా చేసేవారు. ఐఎస్ఓ 9001 (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) గుర్తింపు కంపెనీల్లో ఒకటైన 'తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌ను (టీఎస్పీఎల్) ఖాయిలా పడ్డ ప్రభుత్వ రంగ సంస్థగా (సిక్ పబ్లిక్ సెక్టార్) గురించిన కేంద్ర ప్రభుత్వం.. మూసివేత నిర్ణయాన్ని తీసుకుంది. ఆ స్థలాన్ని కర్ణాటక ప్రభుత్వం కర్ణాటక హౌసింగ్ బోర్డు కార్పొరేషన్‌కు అప్పగించింది. ఆ స్థలంలో విజయనగర జిల్లా అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 1960 సంవత్సరంలో స్ట్రక్చరల్ ఫ్యాబ్రికేషన్ వ్యాపారంలో ఉన్న టీఎస్పీ అలా కాలగర్భంలో కలిసిపోయింది. కేంద్ర కేబినెట్ నిర్ణయంతో 2007లో సంస్థను మూసివేసి.. పే స్కేల్ ప్రకారం అప్పటికి పనిచేస్తున్న 72 మంది ఉద్యోగులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు.

ప్రైవేటీకరణతో గడ్డుకాలం

ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ తరువాత ప్రైవేట్ సంస్థలు సాగునీటి రంగంలోకి ప్రవేశించాయి. దీంతో టీఎస్పీకి కట్‌థ్రోట్ పోటీ ఏర్పడింది. క్రమంగా ఆదరణ తగ్గుతూ వచ్చింది. దీంతో టీఎస్పీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. మూతబడేనాటికి బ్యాంకు రుణాల రూపంలో రూ 15.28 కోట్లు, వడ్డీ కలిపి మొత్తం రూ.17.9 కోట్ల రుణభారం ఉండేది. దీంతోపాటు టీఎస్పీకి రూ.4 కోట్ల వరకూ బకాయిలు రావాల్సి ఉన్నింది. 2004 నాటికి టీఎస్పీ నిర్వహణ భారం మోయలేని స్థాయికి చేరింది. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. పనులు లేక యంత్రాలు తుప్పుపట్టడంతో కేంద్ర ప్రభుత్వం మూసివేత నిర్ణయం తీసుకుంది. బకాయిలు చెల్లించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. టీఎస్పీ ఉన్నింటే టీబీ డ్యాంను నిత్యం పర్యవేక్షించేదని, ముప్పు తలెత్తకుండా చూసుకునేదని అప్పటి ఉద్యోగులు అంటున్నారు.



డ్యాం వద్దకు స్టాప్‌లాగ్స్

●జిందాల్ నుంచి బుధవారం రాత్రికి.. ●నారాయణ, హిందూస్థాన్ నుంచి నేటి ఉదయానికి..

బళ్లారి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిందాల్ స్టీల్ కంపెనీ నుంచి తుంగభద్ర డ్యాం వద్దకు స్టాప్‌లాగ్‌ను బుధవారం రాత్రి తరలించారు. 60 అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల ఎత్తుతో తయారైన ఈ తాత్కాలిక ఇనుప గేటును భారీ వాహనం మీద డ్యాం వద్దకు తరలించారు. జిందాల్ నుంచి డ్యామ్‌కు సుమారు 25 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ గేటును అత్యంత జాగ్రత్తగా, పోలీసు బందోబస్తుతో తరలిస్తున్నారు. హిందూస్థాన్, నారాయణ కంపెనీలకు ఆర్డర్ ఇచ్చిన తాత్కాలిక ఇనుప గేట్లు గురువారం ఉదయం డ్యాం వద్దకు చేరుకుంటాయి. ఈ రెండు కంపెనీలు హొస్పేట్ సమీపంలోనే ఉన్నా.. డ్యాం వద్దకు చేరేందుకు సుమారు 10 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. భారీగా ఉన్న స్టాప్‌లాగ్స్ వెళ్లే మార్గంలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను, విద్యుత్ స్తంభాలను అధికారులు తొలగించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రాత్రి సమయంలో స్టాప్‌లాగ్‌ల తరలింపు ప్రారంభించారు.


జిందాల్ వద్ద తుది దశలో ఉన్న స్టాప్ లాగ్స్

ప్లాన్ ఏ, బీ సిద్ధం

19వ క్రస్ట్‌గేట్ స్థానంలో ఏర్పాటు చేసే స్టాప్‌లాగ్ తయారీ కోసం నిపుణులు, కార్మికులు 48 గంటలపాటు రేయింబవళ్లు శ్రమించారు. కొప్పల్‌లోని హిందూస్థాన్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో రెండు గేట్లు, హొస్పేట్‌లోని నారాయణ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో రెండు గేట్లు, జిందాల్‌లో మరోగేట్‌ను తయారు చేస్తున్నారు. ఒక్కోగేట్ బరువు 13 టన్నులకు పైగా ఉంటుంది. 10 ఎంఎం., 16 ఎంఎం, 20 ఎంఎం ఇనుపప్లేట్లతో వీటిని తయారు చేశారు. ఒక్కోగేట్ తయారీలో 20 మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. హిందూస్థాన్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో గేట్ తయారు ప్రక్రియ బుధవారం సాయంత్రానికి తుదిదశకు వచ్చింది. డ్యాంలో 65 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నప్పుడు తొలుత ఒక గేట్‌ను దింపేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్లాన్-ఏను సిద్ధం చేశారు. హిందూస్థాన్ ఇంజినీరింగ్ కంపెనీ తయారు చేసిన గేట్ గురువారం ఉదయానికల్లా డ్యాం వద్దకు చేరుకుటుందని, దీనిని ప్లాన్-ఏలో భాగంగా అర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని తెలిసింది. ఒకవేళ 65 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్నప్పుడు గేట్ అమరిక సాధ్యపడకపోతే 45 టీఎంసీల నీరు ఉన్నపుడు అమర్చేందుకు ప్లాన్-బీని కూడా సిద్ధం చేశారు.

ప్రవాసాంధ్రుల సహకారం మరువలేం

● పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషించారు ● ఏపీ సీఎం చంద్రబాబుతో కమ్మసంఘం నాయకులు


ఏపీ సీఎం చంద్రబాబునాయుడుతో కమ్మ సంఘం పదాధికారులు

బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్థిరపడ్డ చిత్తూరు జిల్లా వాసులను సార్వత్రిక ఎన్నికల్లో సొంత ప్రాంతాలకు తీసుకెళ్లి ఓట్లు వేయించిన ప్రవాసాంధ్రుల సహకారం మరువలేనిదని ఏపీ సీఎం చంద్రబాబు నాయకుడుకు కమ్మవారి సంఘం నాయకులు వివరించారు. మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబును వారు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో ఐదారు నియోజకవర్గాలకు బెంగళూరునుంచి ఓటర్లను తరలించి మద్దతు కూడగట్టిన విషయాన్ని వివరించారు. దీనిపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా పార్టీ అభ్యర్థులకోసం బెంగళూరులో స్థిరపడిన కమ్మసంఘం సభ్యులు వందలాదిమంది నెలల తరబడి పనిచేశారని ప్రశంసించారు. బెంగళూరులోనూ ప్రాంతాలవారీగా చిత్తూరు అభ్యర్థుల ద్వారా సమావేశాలు నిర్వహించారన్నారు. బెంగళూరులో కమ్మవారిసంఘం కల్యాణమండపంతో ప్రారంభమై ప్రస్తుతం రెండు ఇంజనీరింగ్ కళాశాలల ద్వారా పదివేలమందికి గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలోనే శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ద్వారా కేజీ నుంచి పీజీ దాకా 4వేలమందికి విద్యను అందిస్తున్న విషయాన్ని చైర్మన్ రుక్మాంగదనాయుడు వివరించారు. సీఎం చంద్రబాబును కలసినవారిలో కమ్మవారి సంఘం అధ్యక్షుడు ఆర్ రాజగోపాలనాయుడు, బి లోకనాథనాయుడు, కార్యదర్శి లీలాశంకరరావు, యోగమూర్తి, ప్రభాకరనాయుడు, రాజేంద్రనాయుడు, వేణుగోపాలనాయుడు, పార్టీ కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, రమణబాబు ఉన్నారు.

గ్యారెంటీలు ఆగవు

● బీజేపీవి అర్థంలేని విమర్శలు
● డీసీఎం డీకే శివకుమార్ ధ్వజం

బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వారు విమర్శలు చేసుకుంటూ వంద జన్మలెత్తినా గ్యారెంటీ పథకాలు ఆగవని డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం పద్మనాభనగర్‌లో గ్యారెంటీ పథకాల అమలు కమిటీ, కాంగ్రెస్ ప్రజాసంబంధాల కేంద్రాన్ని డీకే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, బీజేపీ ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గ్యారెంటీ అమలు కమిటీ చైర్మన్ రేవణ్ణ, కేపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, మాజీ ఎంపీ డీకే సురేశ్, బెంగళూరు పాలికె గ్యారెంటీ అమలు కమిటీ చైర్మన్ కృష్ణప్ప, ప్రమోద్ శ్రీనివాస్, నాగరాజ్, ఎల్ శ్రీనివాస్, కబడ్డీబాబు తదితరులు పాల్గొన్నారు.


గ్యారెంటీ పథకాల అమలు కమిటీ కేంద్రం ప్రారంభంలో డీకే

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శ్రీ అరబిందో (జయంతి)



సుప్రసిద్ధ బెంగాలీ పండితుడు, కవిగా గుర్తింపు పొందిన అరబిందో ఘోష్ 1872 ఆగస్టు 15న పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్కత్తాలో జన్మించారు. యోగి, గురువుగా, కవి, రచయితగా, తత్వవేత్తగా రాణించారు. వందేమాతరం గేయాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన తర్వాత కొంతకాలానికి ఆధ్యాత్మికం దిశగా సాగారు. వక్తగా రాణించారు. ఇంటిగ్రల్ యోగాను రూపొందించారు. 1926లో పాండిచ్చేరిలో అరబిందో ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. 1950 డిసెంబరు 5న కన్నుమూశారు.

స్వామి దయానంద సరస్వతి (జయంతి)



అద్వైత వేదాంతంలో ఉపాధ్యాయుడిగా పేరొందిన స్వామి దయానంద సరస్వతి 1930 ఆగస్టు 15న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో జన్మించారు. అర్ష విద్యా గురుకులాన్ని స్థాపించారు. ఎన్నో పుస్తకాలు రచించారు. ఐదు దశాబ్దాలపాటు దేశం లోనూ విదేశాలలో వేదాంతాన్ని బోధించిర హిందూ ధర్మ ఉద్ధరణకు కృషి చేశారు. అంతర్జాతీయ సమితి సదస్సులతోపాటు పలు సమ్మేళనాలలో ప్రసంగించారు. దక్షిణామూర్తి స్తోత్రం, శ్రీరుద్రంలపై అనువాదాలు, వ్యాఖ్యానాలు చేశారు. 2015 సెప్టెంబరు 23న కన్నుమూశారు.

భారతీ విష్ణువర్ధన్ (పుట్టినరోజు)



శాండల్‌వుడ్‌లో పేరొందిన భారతీ విష్ణువర్ధన్ 1948 ఆగస్టు 15న జన్మించారు. బుల్లితెరపైనా, వెండితెరపైనా రాణించారు. 'దుడ్డే దొడ్డప్ప' తొలి సినిమా. ఐదు దశాబ్దాలపాటు కన్నడ సహా హిందీ, తమిళ, తెలుగు, మళయాళం భాషలలో 150 సినిమాలలో నటించారు. నటుడు విష్ణువర్ధన్‌తో కలసి పలు సినిమాలలో నటించి హిట్ పెయిర్‌గా రాణించారు. ఆ క్రమంలో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఉత్తమ నటి, పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. గౌరవ డాక్టరేట్‌ను ఇతర అవార్డులు పొందారు. నటిగానే కాక సింగర్, అసోసియేట్ డైరెక్టర్‌గా రాణించారు.

సుహాసిని మణిరత్నం (పుట్టినరోజు)



దక్షిణాది అలనాటి ప్రముఖనటి సుహాసిని 1961 ఆగస్టు 15న చెన్నైలో జన్మించారు. తమిళ, కన్నడ, మళయాళ, తెలుగు భాషల సినిమాలలో నటించారు. మద్రాస్ ఫిల్మ్ఇన్‌స్టిట్యూట్‌లో డిగ్రీ పొందిన తొలి విద్యార్థిని. జాతీయ పురస్కారంతోపాటు 4 ఫిల్మ్‌ఫేర్, 2 నంది అవార్డులు, 2 కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులు, 2 తమిళనాడు స్టేట్‌ఫిల్మ్ అవార్డులు అందుకున్నారు. ఆమె భర్త మణిరత్నం కూడా దర్శకుడిగా ఎంతో పేరొందారు. నామ్ ఫౌండేషన్ ద్వారా మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు.

అబియ్ అహ్మద్ అలి (పుట్టినరోజు)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత అబియ్ అహ్మద్ అలి 1976 ఆగస్టు 15న జన్మించారు. ఫెడరల్ డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇథియోపియాకు 4వ ప్రధానమంత్రిగా 2018 నుంచి వ్యవహరిస్తున్నారు. ఆర్మో డెమొక్రటిక్ పార్టీ (ఓడీపీ) నుంచి తొలి ప్రధాని ఆయనే. 41వ యేటనే ప్రధాని హోదాను అధిష్ఠించారు. 2019లో నోబెల్ అవార్డు అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి యువతను ప్రోత్సహిస్తున్నారు. కాగా మిలిటరీలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా కలిగియున్నారు.

గురురాజ్ పూజారి (పుట్టినరోజు)



గురురాజ్ పూజారి 1992 ఆగస్టు 15న ఉడుపి జిల్లా కుందాపుర తాలూకాలో జన్మించారు. వెయిట్‌లిఫ్టర్‌గా 2022 కామన్వెల్త్ పోటీలలో పురుషుల 61 కిలోల విభాగంలో కాంస్య పతకం, 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రాతినిథ్యం వహించి 56 కిలోల విభాగంలో రజతపతకం సాధించారు. కాగా 2014లో జాతీయస్థాయిలో అథ్లెట్ పోటీలలో బంగారు పతకం సాధించిన అనంతరం కామన్వెల్త్ దిశగా సాగారు. పేదరికం వచ్చిన అయనకు జాతీయస్థాయిలో రాణించేందుకు పలువురు సహకారం అందించారు. కుటుంబీకులు, మిత్రులు, తదితరుల ఆశలను వమ్ము చేయకుండా కలను సాకారం చేసి ఇతరులలో స్ఫూర్తి నింపారు. కాగా ఆర్మీలో చేరాలని భావించినా క్రీడల కోటాలో చివరకు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం పొందారు.

టీబీపీ గేట్ మీట్

- స్టాప్‌లాగ్, క్రస్ట్‌గేట్ ఏర్పాటుకు ఉన్నతస్థాయి కమిటీ
- డిజైన్, డ్రాయింగ్ అప్రూవల్ బాధ్యత కమిటీకి..
- 1621 అడుగుల లెవల్‌లో స్టాప్‌లాగ్ గేటు
- సాధ్యం కాకపోతే 1617 అడుగులకు తగ్గింపు
- తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అత్యవసర సమావేశం
- వర్చువల్ భేటీలో కీలక నిర్ణయాలు

కర్నూలు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు పునరుద్ధరణ, తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు, డిజైన్, డ్రాయింగ్ అప్రూవల్ వంటి వాటి కోసం ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీని నియమిస్తూ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు (టీబీపీ) నిర్ణయం తీసుకుంది. బోర్డు చైర్మన్ వీరేంద్ర శర్మ అధ్యక్షతన బుధవారం రాత్రి వర్చువల్ విధానంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ నెల 10న శనివారం రాత్రి ఎత్తిన గేట్లను దింపుతుండగా చైన్‌లింక్ తెగిపోయి 19వ గేటు వరదకు కొట్టుకుపోయిన సంగతి తెలిసింది. గేటు పునరుద్ధరణ, తాత్కాలిక స్టాప్‌లాగ్ ఏర్పాటుపై బోర్డు సభ్యులుగా ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గేట్ల నిపుణుడు, సలహాదారులు కన్నయ్యనాయుడు ఆదివారం రాత్రికే టీబీపీ డ్యాం చేరుకొని స్టాప్‌లాగ్ ఎలిమెంట్ తయారీ, ఏర్పాటుపై దృష్టి సారించారు. ఏపీ ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయిప్రసాద్ బోర్డులోనే తిష్టవేసి స్టాప్‌లాగ్ గేటు అమర్చే పనులు పర్యవేక్షిస్తున్నారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు డ్యాంను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అదే క్రమంలో గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్యనాయుడు ఇప్పటికే టీబీపీ బోర్డు అధికారులు, ఇంజనీర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో బోర్డు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



టీబీపీ బోర్డు నిర్ణయాలు

- స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు, గేటు పునరుద్ధరణ, ఇతర పనుల కోసం టీబీపీ బోర్డు సెక్రటరీ, బోర్డు ఐటీ సీఈ, ఎస్ఈ, హెచ్చెల్సీ డివిజన్ ఈఈ మొత్తం నలుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు. ఈ కమిటీ ఆమోదంతోనే గేటు డిజైన్, డ్రాయింగ్ అప్రూవల్, అవసరమైన పనులు చేసేందుకు పరిపాలన అనుమతులు ఇవ్వాలి. పురోగతి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. సకాలంలో పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిర్ణయాలు, సాంకేతిక సమస్యలు తలెత్తితే నిపుణులను సంప్రదిం చడం, థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీ నియమించడం కమిటీ బాధ్యత.
- టీబీ డ్యాం స్పిల్‌వే లెవల్ 1,613 అడుగులలో 43 టీఎంసీలు, 1,617 అడుగుల్లో 54 టీఎంసీలు, 1,621 అడుగులలో 63 టీఎంసీ నీటి నిల్వ ఉంటుంది. డ్యాంలో ఉన్న నీటిని సాధ్యమైనంత వరకు కాపాడుకునేలా 1,621 అడుగుల లెవల్‌లో స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటు చేయాలి. అది సాధ్యం కాకపోతే 1,617 అడుగులకు స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి.. వీలైనంత మేర నీటిని ఆదా చేయాలి.
- గేటు కొట్టుకుపోయిన తక్షణమే డ్యాం గేట్స్ ఎరెక్షన్‌లో అనుభవం కలిగిన గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్యనాయుడును సంప్రదించగా.. ఆయన తాత్కాలిక పునరుద్ధరణ కోసం ఐదు సెగ్మెంట్లలో స్టాప్‌లాగ్ గేట్ల కోసం డిజైన్, డ్రాయింగ్ ఇచ్చారు. ఆమేరకు పనులు చేసి.. నీరు క్రెస్ట్ స్థాయికి దిగువకు తగ్గిన వెంటనే శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టాలి.
- స్టాప్‌లాగ్ ఏర్పాటు కోసం దాదాపు రూ.2.50 కోట్లు ఖర్చు అవుతుంది. అత్యవసర ప్రాతిపదికన తాత్కాలిక పునరుద్ధరణ కోసం పరిపాలన అనుమతులు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నాన్-ప్లాన్ గ్రాంట్ ఏపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. గేటు పునరుద్ధణకు అవసరమైన నిధులు హెచ్చెల్సీ, ఎల్లెల్సీ హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఇందుకు ఏపీ, కర్ణాటక ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆమోదం తెలిపారు.
- గేటు తెగిపోయిన సమయంలో 1,633 అడుగుల లెవల్‌లో 105.788 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. మూడు రోజుల్లో 13 టీఎంసీలు విడుదల చేస్తే.. మరో మూడు రోజుల్లో 40 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. అప్పుడు 1,621 అడుగుల స్థాయికి చేరుకుంటుంది. అప్పుడే స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది. స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు తరువాత ఈ వర్షాకాలంలో సాధ్యమైనంత వరకు డ్యాంను నింపడానికి ప్రయత్నం. గేట్ పునరుద్ధరణ, స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఏర్పాటుపై గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్య నాయుడు ఎలాంటి సూచన చేసినా కమిటీ పరిశీలించాలి.
- గేటు కొట్టుకుపోవడానికి కారణాలు తెలుసుకోవడానికి మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ వేయాలని బోర్డు చైర్మన్ ప్రతిపాదనను ఆమోదించారు. వర్చువల్‌గా జరిగిన ఈ సమావేశంలో బోర్డు చైర్మన్ వీరేంద్రశర్మ సహా కర్ణాటక ప్రభుత్వ జలవనరుల శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి బికులకర్ణి, ఏపీ ఇరిగేషన్ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వర రావు, తెలంగాణ ఈఎన్‌సీ, బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్విందర్ వోహ్రా, కర్ణాటక అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్‌గుప్తా, ఏపీ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్, బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూస్వాధీన ప్రక్రియకు అంతరాయం

» కేఐఏడీబీకి సాగు భూములు ఇవ్వబోమంటూ నిరసన

శిడ్లఘట్ట, ఆగస్టు 14: కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ)కి సాగుభూములు ఇచ్చేది లేదంటూ రైతులు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. తాలూకాలోని జంగమకోటె హోబళి సుమారు 13 గ్రామాలకు చెందిన రైతుల భూములను కేఐఏడీబీ స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తోంది. అయితే రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధం కాగా జంగమకోటె సర్కిల్‌లో పోలీసులు అడ్డుకున్నారు. అధికారులే ఘటనా స్థలానికి వస్తారని పోలీసులు నచ్చచెప్పారు. రైతుసంఘం అధ్యక్షుడు కోడిహళ్ళి చంద్రశేఖర్‌ను చిక్కజాల పోలీసులు అరెస్టు చేయడం సరికాదని సంఘం కార్యాధ్యక్షుడు భక్తరహళ్ళి బైరేగౌడ పేర్కొన్నారు. వెంటనే విడుదల చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కేఐఏడీబీకి సాగుభూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. గతంలో మంత్రి ఎంబీ పాటిల్ హామీ ఇచ్చిన పత్రాన్ని చూపారు. కేఐఏడీబీ కమిషనర్ ఆగస్టు రెండోవారంలో రైతు సభ నిర్వహిస్తారని భరోసా ఇచ్చారన్నారు. సభ జరిగేంత వరకు భూస్వాధీన ప్రక్రియకు అంగీకరించమన్నారు. బెంగళూరు కేఐఏడీబీ కార్యాలయానికి వెళ్లి రైతులందరం అర్జీలు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని భయంతో మమ్మల్ని అడ్డుకోవడం ఎంతవరకు సబబు అని, మా సమస్యలను పట్టించుకోరా అని ప్రశ్నించారు. రైతు నాయకుడు నడిపినాయకనహళ్ళి అజిత్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రైతులంతా కలసికట్టుగా వ్యవసాయభూమిని కాపాడుకునేందుకు నిరసన చేపట్టామని అయితే రైతులు అడ్డుకున్నారన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగానీ, నియోజకవర్గ ఎమ్మెల్యేగానీ ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాల్సి ఉండేదని అయితే ఎవరూ స్పందించకపోవడం విచారకరమన్నారు. చివరకు కేఐఏడీబీ కమిషనర్ రావాలని రైతులు పట్టుబట్టి ర్యాలీ కొనసాగించడంతో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి విడుదల చేశారు. అనంతరం రైతులనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరాపుర మునినంజప్ప, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, తాలూకా అధ్యక్షుడు తాదూరు మంజునాథ్, ఉపాధ్యక్షుడు మళమాచనహళ్ళి రమేశ్, పట్టణ విభాగం అధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



జంగమకోటెలో రైతుల ర్యాలీ

శాండల్‌వుడ్ బాగుండాలంటూ హోమాలు, ప్రత్యేక పూజలు

బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కన్నడ సినిమా రంగంలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలపై బుధవారం కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, హోమాలు జరిపారు. పదిరోజులుగా హోమాలపై ప్రత్యేక చర్చ సాగుతోంది. ప్రముఖ నటుడు దర్శన్ జైలుపాలు కావడం, మరింతమంది కేసుల్లో ఇరుక్కోవడంతోనే శాంతికోసం పూజలు జరిపినట్టు తెలుస్తోంది. అయితే అటువంటిదేమీ లేదని ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ తెలిపారు. దొడ్డణ్ణ, సీనియర్ నటుడు, ఎంపీ జగ్గేశ్ సహా పలువురు పాల్గొన్నారు. కాగా జగ్గేశ్ మీడియాతో మాట్లాడుతూ దర్శన్‌కోసం పూజలంటే నేను వచ్చేవాడిని కాదన్నారు.

కాకరతీగల నాశనంపై ఫిర్యాదు

శిడ్లఘట్ట, ఆగస్టు 14: తాలూకాలోని మేలూరు గ్రామ పంచాయతీ చౌడసంద్ర గ్రామంలో లక్ష్మీపతికి చెందిన సుమారు రెండు ఎకరాలలో కోతకు సిద్ధంగా ఉన్న కాకర పంటను దుండగులు నాశనం చేశారు. రాత్రికి రాత్రి దుండగులు కాకరతీగలను నాశనం చేశారు. ఈ మేరకు గ్రామీణ పోలీసులకు రైతు లక్ష్మీపతి ఫిర్యాదు చేశారు. బాధిత రైతు లక్ష్మీపతి బుధవారం మాట్లా డుతూ లక్ష రూపాయలకుపైగా పంటకు పెట్టుబడి పెట్టానని, కోతకు వచ్చిన పంటను దుండగులు నాశనం చేశారని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రాణాలతో బయటపడ్డ లైన్‌మ్యాన్

బంగారపేట, ఆగస్టు 14: బెస్కాం శాఖ నిర్లక్ష్యంతో బెస్కాం సిబ్బందియే సమస్య ఎదుర్కొన్న ఘటన పట్టణంలో నెలకొనగా లైన్‌మ్యాన్ ఒకరు ప్రాణాలతో బయటపడ్డారు. రాత్రివేళ వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తాలూకాలోని హులిబెలెన గాజగ, మాగొంది గ్రామాలలో విద్యుత్ లేదు. వీటిని సరిచేయడానికి చేసే ప్రయత్నంలో హులిబెలె ఫీడర్‌లో విధి నిర్వహణలో ఉన్న 46 ఏళ్ల గోవిందప్ప షాక్‌కు గురై చివరకు ప్రాణాలతో బయటపడ్డాడు.

పెరిగిన పూలు, పండ్ల ధరలు



పూల విక్రయాలు

చేళూరు, ఆగస్టు 14: వరమహాలక్ష్మి పండుగ, స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో పూలు, పండ్ల ధరలు అమాంతం పెరి గాయి. శ్రావణ మాసం తో పండుగల సీజన్ ఆరంభమైందని, పంట దిగుబడులు అంతంత మాత్రంగానే ఉండడంతో డిమాండ్ పెరిగిందని వ్యాపారస్తులు అంటున్నారు. నాలుగైదు రోజులుగా క్రమేపీ కూరగాయల ధరలు కూడా పెరిగాయి. పండుగకావడంతో మరింత పెరిగి నట్టు తెలుస్తోంది. పండుగలు కావడంతో ధరలతో నిమిత్తం లేకుండా తమ శక్తికొలదీ అవసరమైనవి కొను గోళ్లు చేస్తుండడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది. చేళూరు తాలూకా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

10వేల మొక్కలు నాటిన ఎన్‌సీసీ బృందం

చింతామణి ఆగస్టు 14: తాలూకాలోని కైవార సమీపాన ముత్తకదహళ్ళిలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో ఎన్‌సిసి జట్లు 10వేల మొక్కలు నాటాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ జూన్ 5న ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి విదితమే. బుధవారం 5, 10 కర్నాటక బెటాలియన్ ఎన్‌సిసి కమాండ్ ఆఫీసర్ కల్నల్ లునిక్‌బస్‌రాయ్ నేతృత్వంలో మొక్కలు నాటారు. కల్నల్ మాట్లాడుతూ దేశంలో పచ్చదనం పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారన్నారు. చిక్కబళ్ళాపుర, చింతామణి, కోలారుల నుంచి ఎన్‌సీసీ కేడెట్‌లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారన్నారు. ఉత్సాహంగా మొక్కలు నాటారన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ విద్యా సంస్థ చేళూరు రోడ్డులోని లక్ష్మీ విద్యాసంస్థ కోశాధికారి డాక్టర్ ఎన్ఆర్ విక్రమ్, మేనేజర్ నారాయణరెడ్డి బాబు, సుబ్బారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కేడెట్‌లు



ఎన్‌సీసీ కేడెట్‌ల బృందం

గ్యారెంటీ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 14: గ్యారెంటీ పథకాల ద్వారా లక్షలాదిమంది ప్రజలు ప్రయోజనం పొందారని మంత్రి రామలింగారెడ్డి అభిప్రాయపడ్డారు. గ్యారెంటీ పథకాల అమలు కమిటీ కార్యాలయాన్ని స్థానిక బొమ్మనహళ్ళి కమిటీ అధ్యక్షుడు టీ వాసుదేవరెడ్డి నేతృత్వంలో బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. గ్యారెంటీ పథకాలకు కేంద్రం నుంచి ఎలాంటి సాయం అందలేదన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు కేంద్రానికి చెల్లిస్తున్నాకూడా పథకాల అమలుకు కేంద్రం నుంచి పైసా రాలేదన్నారు. పేద ప్రజలకోసం ఉద్దేశించిన పథకాలకు కేంద్రప్రభుత్వ గ్రాంటు అందలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంబాని, అదాని వంటి కార్పొరేట్ నేతలకు ఇస్తున్న ప్రాధాన్యత సామాన్యుల పట్ల చూపలేదన్నారు. కాగా గ్యారెంటీ పథకాలపై కొంతమంది బీజేపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని పట్టించుకోవద్దన్నారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రేవణ్ణ, బీకే హరిప్రసాద్, నగర అధ్యక్షుడు కృష్ణప్ప, మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి, మాజీ ఎంపీ ఉగ్రప్ప, బొమ్మనహళ్ళి కాంగ్రెస్ నాయకులు కే వాసుదేవ రెడ్డి, రవీంద్ర, సత్యనారాయణ, శ్రీనివాసమూర్తి, అనిల్‌రెడ్డి, లోకేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి తదితరులు

రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో కుండపోత

- పొంగి పొర్లిన వాగులు, వంకలు



రాయదుర్గం, ఆగస్టు 14: రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాలలో కుండపోత వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల దాకా భారీవర్షం కురవడంతో వాగులు, వంకలు వరదనీటితో పొంగిపొర్లాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా ఆగిపోయింది. రాయదుర్గం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన కొలిమివీధి, సెయింట్‌పాల్ ఏరియా, దాసప్పరోడ్డు ప్రాంతాలలో ఇళ్లల్లోకి నీరు చేరాయి. ప్రధానంగా ముత్రాసికాలనీ కూడా లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముందస్తుగా కాలువల్లో పూడికతీత పనులు చేయించడంతో నీరు ఇళ్లల్లో చేరలేదు. గుమ్మఘట్టలో 129.2 మి.మీలు, రాయదుర్గంలో 75.6 మి.మీలు, డీ.హీరేహాళ్‌లో 52.0 మి.మీల వర్షం కురిసింది. రాయదుర్గం మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు పంటలు నీట మునిగాయి. అన్ని గ్రామాల చెరువుల్లోకి నీరు చేరాయి. గుమ్మఘట్ట మండలంలో చెక్‌డ్యాములు, కుంటలు నిండిపోయాయి. తాళ్లకెర గ్రామంలో బోయ మారన్నకు చెందిన ఇల్లు నేలకూలింది. కాగా ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కణేకల్లు మండల వ్యాప్తంగా కురిసిన వర్షానికి వేదావతి హగరి పొంగి పొర్లింది. బొమ్మనహాళ్ మండలంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది.

గుండెజబ్బు చికిత్స అందుబాటులో ఉండాలి

బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతితోపాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో గుండె జబ్బులకు చికిత్సలు ఉండాలని బెంగళూరు జలమండలి చైర్మన్ రామ్‌ప్రసాత్‌మనోహర్ తెలిపారు. బుధవారం ఎంఎస్ పాళ్యలోని సింగాపురలో అవేక్ష హార్ట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో హృదయ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని వైద్యుల సలహాలతో చికిత్సలు పొందాలన్నారు. డాక్టర్ ఉదయ్‌భల్లాళ్ వారి కుటుంబసభ్యులు అన్ని సదుపాయాలతో అందరికీ ఆరోగ్యం అందుబాటులో ఉండాలని అవేక్ష పేరిట హార్ట్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బెంగళూరు యూనివర్సిటీ కులపతి డాక్టర్ జయకర్‌శెట్టి ముఖ్యులుగా పాల్గొన్నారు. అవేక్ష హార్ట్ సెంటర్ ఫౌండర్ ఉదయ్‌భల్లాళ్, హారతి భల్లాళ్, ఉజ్వల భల్లాళ్, ఆదిత్యభల్లాళ్, స్పర్శ్ ఆసుపత్రి హృద్రోగ నిపుణులు డాక్టర్ నూతన్, సూరజ్‌లు పాల్గొన్నారు.



ఆసుపత్రి ప్రారంభంలో ప్రముఖులు

పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత

బెంగళూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణం కాపాడడం అందరి బాధ్యత అని రామయ్య గ్రూప్ సంస్థల ఉపాధ్యక్షులు ఎంఆర్ సీతారాం అభిప్రాయపడ్డారు. బెంగళూరు యూనివర్సిటీ ప్రాంగణంలో రామయ్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొం దించేందుకు సమాజంలో అందరి సహకారం కావాలన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంఆర్ జయరాం

గ్రామాలకు అదనపు బస్సులు నడపండి: కరవే

బాగేపల్లి, ఆగస్టు 14: తాలూకాలోని పాఠశాల, కళాశాల విద్యార్థులకు వీలుగా బస్సు సర్వీసులు నడపాలని కర్ణాటక రక్షణా వేదిక డిమాండ్ చేసింది. కరవే తాలూకా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కరవే తాలూకా అధ్యక్షుడు హరీశ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు నిత్యం పట్టణానికి వస్తున్నారన్నారు. శక్తి పథకం అమలుతో ఉచిత ప్రయాణం పెరగడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సజ్జపల్లి, శ్రీరామపుర, గూళూరు, చర్లోపల్లి, దిగవగొల్లపల్లి మార్గాల్లో ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు తగిన బస్సు సర్వీసులు కల్పించాలని కోరారు. కరవే జిల్లా అధ్యక్షు రాలు సుజాతమ్మ, కే శ్రీనివాస్, యశ్వంత్, ఎంఎస్ రాజు, బీ రాజు, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో కరవే కార్యకర్తలు, తదితరులు

రైతుపై ఎలుగుబంట్ల దాడి

కళ్యాణదుర్గం, ఆగస్టు 14: మండలంలోని ఉప్పొంక గ్రామంలో రామన్న అనే రైతుపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. బాధితుడు తెలిపిన మేరకు... బుధవారం తెల్లవారుజామున వ్యవసాయ తోట వద్దకు బయల్దేరానన్నాడు. దారి మధ్యలో ముళ్లపొదల్లో దాగి ఉన్న రెండు ఎలుగుబంట్లు ఒక్కసారిగా దాడి చేశాయన్నారు. గట్టిగా అరవడంతో అవి సమీప అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు తెలిపారు. తన అరుపులు విని వచ్చిన కొంతమంది కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించా రు. బాధితుడికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మధ్యకాలంలో కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎలుగు బంట్ల దాడులు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో వ్యవసాయ పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. అటవీ అధికారులు రక్షించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.